

# కథ

గన్నవరపు నరసింహామూర్తి

# కోడలి కానుక

"జానకీ! ఈ రోజు మా పే కమీషన్ ఎరి యర్స్ వచ్చేయి. నువ్వింక ఆలస్యం చెయ్యకుండా బంగారుగాజులు చేయించుకో. మన పెళ్లైన యిరవై ఐదేళ్ల నుంచి నీకు యిదిగో చేయిస్తాను, అదిగో చేయిస్తాను అంటూ ఆశ పెడుతూ వచ్చాను. ఇప్పుడు గానీ కొనుక్కోకపోతే మళ్లీ నా పదవీ విర మణ దాకా కుదరదు" ఆఫీసు నుంచి యింట్లోకి వస్తూ అన్నాడు రమణమూర్తి.

"ఇప్పుడా గాజులు చేయించుకోకపోతే కొంపేం మునిగిపోదుగానీ ముందు అమ్మాయి పురిటి సంగతి ఆలోచించండి. మళ్లీ వారమే అమ్మాయిని పురిటికి తీసుకురావాలి. బోలెడు ఖర్చులు. అదీగాక ఉన్నగానొక్క కొడుకు ఉద్యోగం లేక బాధపడు తుంటే యిప్పుడు నాకా గాజులొద్దు బాబూ" భర్త చేతిలో సంచీ అందుకుంటూ విసుగ్గా అంది జానకి. అలా అంటున్నప్పుడు ఆమె కన్నుల్లో సన్నటి తడిని గమనించాడు రమణమూర్తి.

రమణమూర్తికి ఆమెని చూస్తే జాలేసింది. పాపం పెళ్లై యిద్దరి పిల్లల తల్లైనా ఏనాడూ తనని ఏ కోరికా కోరిన పాపాన పోలేదు. తన కష్టాల్లో పాలు పంచుకుంటూ ఈ కుటుంబాన్ని గౌరవప్రదంగా నెట్టుకొస్తోంది. నిజంగా జానకి తన భార్య కాక పోయి ఉంటే తన జీవితం యింత సవ్యంగా సాగిపో యేదా అన్న అనుమానం రమణమూర్తికి ఎన్నో సార్లు కలిగింది.

ఆ సాయంత్రం జానకి భర్తకి కాఫీ అందిస్తూ "ఎల్లుండి రామం సీతని తీసుకొస్తున్నానని ఫోన్ చేశాడు. నిన్నటికే ఏడో నెల నిండిపోయిందిట. అల్లుడికి శలవు లేక రామాన్ని రమ్మంటే వాడు అక్కడికి వెళ్లాడుట. అది రాగానే దానికి గాజులు పెట్టించాలి. ఆ ముహూర్తం చూడండి. అయినా మీ పిచ్చిగాని యిప్పుడు గాజులు కార్యక్రమానికి, దాని పురిటికి, బారసాలకి కలిపి లక్ష రూపాయలు పైనే ఖర్చవుతుంది. ఈ రోజుల్లో పురుళ్లంటే మాటలా? అన్నీ హాస్పిటల్లోనే. అందుకనీ ఆ ఎరియర్స్ డబ్బులు జాగ్రత్త చెయ్యండి" ఆమె చెప్పుకుపో తోంది.

అవన్నీ వింటూ రమణమూర్తి నిట్టూర్పు విడి చాడు. అతనికెందుకో తన పెళ్లినాటి రోజులు గుర్తుకు రాసాగాయి.

* * *

రమణమూర్తి జానకిల వివాహం జరిగి పాతిక సంవత్సరాలైంది. రమణమూర్తి వివాహ సమయా నికి తాలూకా ఆఫీసులో ఒక చిన్న గుమాస్తాగా చేస్తుండేవాడు. జానకి అతని మేనమామ కూతురే కాక అతనికి కాలేజీలో రెండేళ్ల జూనియర్ కూడా! దురదృష్టవశాత్తూ జానకి డిగ్రీ చదువుతుండగా ఆమె తల్లికి జబ్బు చేసి చనిపోవడంతో ఆమె చదు వుకి ఆఖరి సంవత్సరంలో ఆటంకం ఏర్పడింది. అప్పటికే రమణమూర్తి, జానకి పీకలోతు ప్రేమలో కూరుకుపోయి ఉండటం వల్ల వాళ్లిద్దరి వివాహం పెద్దల అంగీకారంతో జరిగిపోయింది.


జానకి తండ్రి వెంకట్రామయ్యకి పెద్దగా ఆస్తిపా స్తులు లేకపోవడం వల్లనూ, తాను చేస్తున్నది చిన్న ఉద్యోగం వల్లనూ పెళ్లిని సాదాసీదాగా చేశాడు. పదవీ విరమణ చేస్తే వచ్చే సొమ్ముతో ఆమెకు నగలు చేయిస్తామని చెప్పడంతో ఆ విషయమై ఎవ్వరూ పెదవి విప్పలేదు. రమణమూర్తి తండ్రి కూడా కొన్ని ఆర్థిక యిబ్బందుల వల్ల పెళ్లిని మంగళ సూత్రం తోనే ముగించాడు.

అందుకే పెళ్లైన తరువాత జరిగే శోభనం రోజున జానకి బోసి మెడ, చేతులు చూసి ఆమెకు త్వరలోనే నగలు చేయిస్తానని చెప్పాడు. కానీ ఆ కోరికను ఆమె సున్నితంగా తిరస్కరించింది. ఏ శుభ ముహూర్తంలో జానకితో అతని వివాహం అయిం దోగానీ రమణమూర్తికి అదే వూళ్ళో జిల్లా పరిషత్ హైస్కూల్లో సైన్స్ టీచర్‌గా ఉద్యోగం వచ్చింది. అందుకే రమణమూర్తికి జానకి అంటే విపరీతమైన ప్రేమ! ఆమె తన జీవితంలో ప్రవేశించడంతో లక్ష్మీ దేవి తన యింట్లో కాలుమోపిందని అతని ప్రగాఢ నమ్మకం. అందుకే ఆమె మనస్సుని ఎప్పుడూ నొప్పించరాదని అతనొక నిర్ణయం తీసుకున్నాడు.

తమ మొదటి పెళ్లిరోజునాడు జానకి భర్తతో తన మనసులో మాట చెప్పింది. తనకి బంగారు గాజులంటే చిన్నప్పటినుంచీ యిష్టమనీ, ఎప్పుడైనా వీలైతే రెండు చేతులకి సరిపడా గాజులు చేయించు కోవాలన్నది తన అభీష్టమని చెప్పింది. వెంటనే రమ ణమూర్తి ఆ సంవత్సరమే ప్రావిడెంట్ ఫండ్ లోన్ పెట్టి బంగారుగాజులు చేయిస్తానని వాగ్దానం చేశా డామెకు. కానీ యింతలోనే ఆమె గర్భవతి కావడం, జానకి తండ్రికి ఒంట్లో బాగోలేకపోవడంతో పురుడు కూడా తమ యింట్లోనే పోయవలసి రావ డంతో ఖర్చులు పెరిగి బంగారు గాజుల కానుక తాత్కాలికంగా వాయిదా పడింది.

అక్కణ్ణుంచీ ప్రారంభమైంది వాయిదాల పరం పర. ఆ తరువాత రామం పుట్టడం, వాడి పాల కోసం, మందులకోసం ఖర్చులతో రెండవ సంవ త్సరం, రమణమూర్తి తండ్రి పోవడంతో మూడవ సంవత్సరం, ఆ తరువాత చేసిన అప్పులకు వడ్డీలు కట్టవలసి రావడంతో ఐదు సంవత్సరాలు వరుసగా వాయిదా పడింది. ఏదో బాధలు తాత్కాలికంగా సమసిపోయి స్థిమిత పడుతున్న తరుణంలో మళ్లీ రెండవసారి గర్భవతైంది జానకి. అలా మరో రెండు సంవత్సరాలు మళ్లీ గాజులు చేయించాలన్న కార్య క్రమం వాయిదాపడింది.

తరువాత పిల్లలు పెద్దవాళ్లై వాళ్ల కాన్వెంటు, హైస్కూలు, కాలేజీల చదువుల వల్ల ఖర్చు భారీగా పెరగడంతో ఇక గాజులు చేయించాలన్న కార్య క్రమం మరికొన్ని సంవత్సరాలు శాశ్వతంగా వాయిదా పడింది. అది ఎంతవరకు వచ్చిందంటే జానకి ఆ గాజుల విషయం పూర్తిగా మరచిపో యింది. ఈలోగా కూతురు స్మృతి చదువు పూర్తవ డంతో వివాహం చెయ్యాలని తలపెట్టారు. అదృష్టవ శాత్తూ మంచి సంబంధం కుదరడంతో చదువు పూర్తైన సంవత్సరమే వివాహం జరిపించారు. కొడుకు చదువు పూర్తైనా యింకా ఉద్యోగం రాకపో వడంతో ఆ కుటుంబానికి ఆర్థిక యిబ్బందులు పెరిగి జానకి బంగారు గాజుల కార్యక్రమం



పూర్తిగా వాయిదా పడింది. ఆమె కోరిక కోరికగానే మిగిలిపోయింది. రమణమూర్తి తను భార్యకు కానుకగా యిస్తానన్న గాజులు చేయించలేక ఒక విధమైన అపరాధ భావనకు గురయ్యాడు.

కానీ మళ్లీ యిన్నాళ్లకు అతనికి ఎరియర్స్ రావడంతో ఆ కానుక గుర్తొచ్చి భార్యకు చెబితే ఆమె మళ్లీ ఖర్చుల చిట్టా విప్పడంతో అతనిలో మళ్లీ నిరాశ ఆవహించింది.

★ ★ ★

వారం రోజుల తరువాత ఒకరోజు జానకి వంట చేస్తుంటే స్కూటర్ వచ్చి యింటి ముందు ఆగింది. స్కూటర్ మీద రామం, వెనుక ఒక అమ్మాయి ఉన్నారు. స్కూటర్ ఆగగానే వెనకాల కూర్చున్న అందమైన అమ్మాయి క్రిందకు దిగడంతో, అతను స్టాండ్ వేశాడు. ఆ తరువాత యిద్దరూ కలిసి తిన్నగా వంటింట్లోకి వచ్చారు. వచ్చిన ఆ అమ్మాయి తెల్లగా, పంజాబీ డ్రెస్‌లో ఆకర్షణీయంగా ఉంది.

రామం వస్తూనే "అమ్మా! మొన్న జరిగిన మున్సిపల్ టీచర్ల సెలక్షన్స్‌లో నేను సైన్స్ టీచర్‌గా ఎంపికకాబడ్డాను. బైదిబై ఈ అమ్మాయి సులోచన. కాలేజీలో నా క్లాస్‌మేట్. ఈమె కూడా నాతో పాటు సైన్స్ టీచర్‌గా సెలక్టయింది" అంటూ వివరాలు చెప్పడం మొదలుపెట్టాడు.

ఆ అమ్మాయి వెంటనే జానకి కాళ్లకు నమస్కరించింది.

జానక్కి ఆమెను చూడగానే మంచి అభిప్రాయం కలిగింది. వెంటనే రామంతో "నువ్వు అమ్మాయిని హాల్లో కూర్చోపెట్టరా; నేను కాఫీ తీసుకొస్తాను" అనగానే రామం, సులోచన హాల్లోకి వెళ్లిపోయారు. కాసేపటికి ఆమె కాఫీలతో హాల్లోకి రాగానే యిద్దరూ ప్రక్క ప్రక్కన కూర్చొని మాట్లాడుకోవడం గమనించింది. జానకిని చూస్తూనే ఆమె రామానికి దూరం జరిగి కాఫీని అందుకుంది. కాసేపు పిచ్చాపాటి మాట్లాడిన తరువాత ఆమె వెళ్లిపోయింది.

ఆ సాయంత్రం కొడుకు రామాన్ని డాబా మీదకు తీసుకెళ్లి సులోచన వివరాలు అడిగింది. ఆమె మాటలు విన్న రామం కాసేపు మౌనం వహించి తరువాత చెప్పడం మొదలుపెట్టాడు. "అవునమ్మా! సులోచనా నేను యింటర్ నుంచి మంచి స్నేహితులం. డిగ్రీ, బి.ఇడీ కూడా కలిసే చదివాం. ఈ మధ్యనే వివాహం చేసుకుందామని కూడా నిర్ణయించుకున్నాం. వాళ్లు కూడా మనవాళ్లే. కాకపోతే వాళ్లమ్మగారు ఈమధ్యనే చనిపోయారు. వాళ్ళ నాన్నగారికి ఒంట్లో బాగులేక ఈ మధ్యనే వాలెంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నారు. అందుకే ఈమె వివాహానికి తొందరపడుతున్నారు. ఈ పెళ్లి విషయం చాలా రోజుల నుంచి నీతో చెప్పాలనుకుంటున్నానమ్మా! కానీ నిరుద్యోగిగా ఆ విషయం నీతో చెప్పడానికి నా మనస్సంగీకరించలేదు. ఈరోజే యిద్దరికీ ఒకేసారి అదీ మన ఊరి మున్సిపాల్టీలో టీచర్లుగా ఉద్యోగాలు రావడంతో నువ్వు కాదనవనే ధైర్యంతో ఆమెను మనింటికి తీసుకొచ్చాను" సుదీర్ఘంగా చెప్పాడు రామం.

"అమ్మాయైతే లక్షణంగానే ఉందిరా! ఆ విషయంలో సరే; నేనాలోచిస్తోంది అది కాదురా! నేనూ పెళ్లైన నాటికి తల్లి లేని పిల్లనే. నన్ను పెళ్లి చేసుకున్న మీ నాన్నగారు అత్తవారింటి ముచ్చట్లు ఏవీ పొందలేకపోయారు. ఆ విషయం తల్చుకొనీ నేను యిప్పటికీ బాధపడుతుంటాను. మళ్లీ నువ్వు తల్లి లేని పిల్లని చేసుకుంటే నీకూ అంతే! పిల్లకి తల్లి ఉంటే ఉండే భద్రత వేరురా! ఈ పెళ్లికి మీ నాన్నగారేం అంటారో?" తన మనసులోని ఆవేదన వెలిబుచ్చింది జానకి.

"నాన్నగారి సంస్కారం నాకు తెలుసమ్మా!


అతను కాదనరనే అనుకుంటున్నాను. చాలాకాలం స్నేహితులుగా ఉండి ఒకరి నొకరు అర్థం చేసుకుని జీవితం పట్ల ఒక అవగాహన ఏర్పరచుకొని మరీ ఈ పెళ్లికి సిద్ధపడ్డాం. కాబట్టి నాన్నగార్ని ఒప్పించి ఎలాగైనా మా పెళ్లిని జరిపించవలసిన బాధ్యత నీదే నమ్మా" ఆర్ద్రంగా అన్న రామం మాటలు ఆ తల్లి గుండెను కదిలించాయి. కాసేపు అక్కడ మౌనం.

ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ జానకి అంది. "అసలు విషయం మరిచానురా! వాళ్ల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం అంటున్నావు. మన పరిస్థితి కూడా నీకు తెలుసు. మీరు పుట్టిన దగ్గర్నుండీ యిప్పటి దాకా మీ నాన్నగారు ఎన్నో ఆర్థికపరమైన సమస్యలు ఎదుర్కొన్నారు. ఇంకా ఆ అప్పుల బాధ ల్నుంచి విముక్తి కాలేదాయన. అందుకనీ అత్తవారు ఆర్థికంగా బాగుంటే నీ జీవితం హాయిగా, సుఖంగా సాగిపోతుంది. ఇదేదో నేను స్వార్థంతో చెబుతున్న మాటలు కావు. అలా అనీ అత్తవారిపై ఆధారపడ మనీ కూడా చెప్పటం లేదు. కానీ వారి పరిస్థితి బాగుంటే నీకు ఏ విధంగానైనా ఉపయోగపడుతుం దని నా ఆలోచన. కాబట్టి ఈ విషయం మరికొద్దిరో జులు ఆలోచించి నీ నిర్ణయం చెప్పు. అప్పుడు మీ నాన్నగారికా విషయం చెబుతాను. అంతవరకు ఓపిక పట్టు" అంది.

రామం మౌనంగా క్రిందకు దిగిపోయాడు.

కానీ ఆ రాత్రి జానకి పడుకునే ముందు ఉండబ ట్టలేక ఈ విషయం భర్తతో చెప్పింది. అతను అంతా వినీ "ఈ విషయం యింతకు ముందెప్పుడూ వాడు చెప్పలేదు. అన్నీ వాళ్లు నిర్ణయించుకుని మరీ యిప్పుడు మనకి చెబితే మనం ఏం చెయ్యగలం చెప్పు. అదీగాక వాడి చదువు, పిల్ల పెళ్లి, పురుడు వీటన్నిటికీ చాలా అప్పులు చేయవలసి వచ్చింది. చివరికి పాపిష్టి వాణ్ణి మన మొదటి పెళ్లిరోజు నాడు నీకు చేసిన బంగారు గాజుల వాగ్దానాన్ని కూడా తీర్చలేకపోగా నీ ఒంటిమీద తులం బంగారం లేకుండా అన్నీ అమ్మేసిన అసమర్థుణ్ణి. చివరకు వాడి పెళ్ళప్పుడైనా నీ కోరిక తీర్చాలనుకున్నాను. కానీ నువ్వు చెబుతున్న ప్రకారం యిప్పుడు కూడా ఆ కోరిక తీరేటట్టు లేదు. ఏం చేస్తాం మన ప్రారబ్ధం" అతను మాట్లాడుతూంటే గొంతు బొంగురు పోసాగింది.

అతని ఆవేదన చూస్తుంటే జానక్కి ఏం చెయ్యాలో తోచటం లేదు. ఒక ప్రక్క కొడుకు అభ్య ర్థన, వద్దనీ భర్త అభ్యంతరం...ఏం చెయ్యాలో అని ఆమె మథన పడసాగింది. చాలాసేపటి వరకు ఆమె మనిషి కాలేకపోయింది. కొద్దిసేపటి తరువాత స్థిమి తపడి "ఆరోజు మీరు నన్ను ప్రేమించి మా నాన్న ఎన్నో బాధల్లో ఉన్నా నన్ను పెళ్లాడలేదా? ఎందుకు? నాకోసమేగా? అప్పుడు మీరు యివన్నీ ఆలోచిస్తే మన పెళ్ళి అయ్యేదంటారా? మీలాగే మీ కొడుకు కూడా! ఆ పిల్ల అందంగా తీర్చిదిద్దిన ట్లుంది. వాళ్ల జంట చూడముచ్చటగా ఉంది. పైగా వాళ్లిద్దరికీ యిక్కడే ఉద్యోగం. వాళ్ళిద్దరూ సంపాది స్తుంటే మీరు నిశ్చింతగా ఉండొచ్చు. ఆ అప్పులన్నీ వాళ్లే తీరుస్తారు. ఎందుకో ఆ అమ్మాయిని చూస్తే చాలా మంచిదానిలా కనిపిస్తోంది. ఇక నా బంగారు గాజుల కానుక సంగతంటారా, వాటిని మీరు పదవీ విరమణ చేసేటప్పుడు వచ్చే డబ్బుల్తో కొందురుగాని. అయినా పిల్లలు జీవితంలో స్థిరపడి హాయిగా ఉంటే నాకదే పదివేలు. ఈ కానుకలేవీ ముఖ్యం కాదు. కాబట్టి మీరవేమీ మనసులో పెట్టు కొని బుర్రపాడు చేసుకోవద్దు" అంటూ సవివరంగా చెప్పడంతో రమణమూర్తి మనసు స్థిమితపడి నిశ్చిం



## ప్చ్! మమత!!

కేరళ కుట్టి మమతా మోహన్‌దాస్ ఈమధ్య తెలుగులోనే కాకుండా అటు మలయాళంలో కూడా అంతగా కనిపించకపోవడానికి కారణం- ఆమె ఆరోగ్య సమస్యేనని అంటున్నారు సినీజనాలు. హెల్త్ ప్రాబ్లెమ్ వల్ల చిన్నపాటి సర్జరీతో విశ్రాంతి తీసుకోవడం వల్లనే ఆమె కెమెరాకి కొంతకాలంగా దూరంగా వున్నట్టు ఆమె సన్నిహితుల ఉవాచ. రెస్టు తర్వాత ఇప్పుడామె పూర్తి ఉత్సాహంతో తిరిగి సినిమాల్లో నటించడానికి సిద్ధమవుతోందిట. నాగార్జున కొత్త చిత్రంలో మమతా మోహన్‌దాస్ కూడా నటించే చాన్సు వుందని ఓ భోగట్టా.

తగా నిద్రలోకి జారుకున్నాడు.

* * *

మరో నెల రోజుల తరువాత రామం, సులోచనల వివాహం ఆర్భాటాలు లేకుండా సాదాసీదాగా జరిగిపోయింది. సులోచన తండ్రి ఆర్థికంగా స్థితిమంతుడు కాకపోవడంతో పెద్దగా కట్నకానుకలు యివ్వలేకపోయాడు. జానకి మాత్రం పట్టుబట్టి కోడలుకి పుస్తెల తాడుతోబాటు గొలుసు కూడా చేయించింది.

కాల చక్ర భ్రమణంలో సంవత్సరం గడిచిపోయింది. ఆ సంవత్సరంలో చాలా సంఘటనలు చోటుచేసుకున్నాయి. కొడుకు, కోడలు ఉద్యోగం చేస్తూ రమణమూర్తి అన్ని అప్పులు తీర్చేశారు. అదీగాక ఆ సంవత్సరం ఆడబడుచు స్మృతిని, భర్తని పండగకి పిలిచి బట్టలు పెట్టి ఎంతో గౌరవించింది సులోచన. ఆమె సత్ప్రవర్తనతో సులోచన ఆ యింట్లో వాళ్లందరికీ దగ్గరైంది. ఇప్పుడు రమణమూర్తికి కోడలంటే చాలా అభిమానం. ఆ యింటి పెత్తనం అంతా ఆమెదే.

ఆ రోజు రామం, సులోచనల మొదటి వివాహ వార్షికోత్సవం. ఆ రోజుని ఆ యింట్లో అందరూ పండుగలా జరుపుకున్నారు. చివరగా భోజనాల ముందు సులోచన అత్తమామల కాళ్లకు దండం పెడుతూ ఒక పేకెట్ అత్తగారి చేతిలో పెట్టింది. జానకి ఆశ్చర్యపోతూ దాన్ని తెరచి చూసింది. అందులో ఉన్న వస్తువుల్ని చూసి ఆమె ఒక్కసారిగా నిర్ఘాంతపోయింది. వాటిని చూసిన రమణమూర్తి కూడా చేష్టలుడిగి చూడసాగాడు. అందులో పచ్చగా ధగధగా మెరిసిపోతూ కనిపించాయి డజను బంగారు గాజులు. ఇద్దరూ అయోమయంగా కోడలు వైపు చూడసాగారు. ఆమె కంట్లో సన్నని నీటి తెరని గమనించారు ఆ దంపతులు. వెంటనే రామం వైపు తిరిగి ఏమిటి విషయం అనీ కళ్లతోనే సంజ్ఞలు చేశారు? అతను తల అడ్డంగా ఊపుతూ తనకేం తెలియదని అమాయకంగా ముఖం పెట్టడంతో సులోచన వైపు తిరిగారు మళ్లీ.

అప్పుడు సులోచన కంటనీరు తుడుచుకుంటూ "నిజంగా మీరిద్దరూ నాకు అత్తమామలు కారు. తల్లిదండ్రులు. మా అమ్మ అకస్మాత్తుగా చనిపోవడంతో జీవితం నాకు చాలా నిరాశాజనకంగా తోచే సమయంలో నా అదృష్టంకొద్దీ ఈ యింటి కోడలినయ్యాను. చిన్నప్పట్నుంచీ నేను ఎన్నో కుటుంబాల్ని చూశాను. కానీ ఈ యింటిలో మనుషుల మధ్యనుండే ప్రేమాభిమానాలు, ఆత్మీయతలు నేనెక్కడా చూడలేదు.

ఆ రోజు అత్తగారి జోక్యం వల్లే మా వివాహం జరిగిందనీ నాకు తెలుసు. కానీ మా మొదటిరాత్రి మీ అబ్బాయి ద్వారా విషయం తెలిసింది. మామయ్యగారు మీకు ఎప్పట్నుంచో బంగారు గాజులు చేయించాలనుకుంటున్నారనీ, కానీ కొన్ని ఆర్థిక యిబ్బందుల వల్ల అది కుదరలేదనీ తెలిసి నేను చాలా బాధపడ్డాను. కానీ అప్పట్లో ఏమీ చెయ్యలేని నిస్సహాయ స్థితి నాది.

అందుకే ఈ సంవత్సరం ప్రతీ నెలా ఐదువేల రూపాయలు చొప్పున ఆదా చేశాను. అదీగాక మా అమ్మ చిన్నప్పుడు నా పేర యాభై వేల రూపాయలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన సొమ్ము రెండింతలై మొన్ననే అందింది. విషయం చెబితే మీరందరూ కోప్పడతారనీ ఎవరికీ చెప్పకుండా అత్తగారికిష్టమైన ఈ బంగారుగాజుల్ని చేయించాను. నిజంగా ఈ విషయం మీ అబ్బాయికి కూడా యిప్పటి దాకా తెలియదు.

మా మామగారు అత్తగారికి ఎప్పుడో చేసిన ఈ చిరు వాగ్దానాన్ని నెరవేర్చవలసిన బాధ్యత ఈ యింటి కోడలిగా నామీదుంది. అందుకే మా వివాహ వార్షికోత్సవం రోజున ఈ చిరు కానుకని యిస్తున్నాం. ఈ గాజుల్ని మీ చేతికి మామగారు తన స్వహస్తాలతో తొడగాలని నా చిన్ని కోరిక. తీరుస్తారనే ఆశిస్తున్నాను" అంటూ ఆ గాజుల్ని రమణమూర్తి చేతికందించింది.

రమణమూర్తి సంభ్రమాశ్చర్యాలతో ఆ గాజుల్ని జానకి రెండు చేతులకీ తొడిగాడు.

ఆ దృశ్యం చూస్తున్న జానక్కి ఏం జరుగుతోందో అర్థం కావట్లేదు. ప్రేమతో కోడల్ని అక్కున చేర్చుకుంది. వారిద్దర్నీ చూసి తండ్రీ కొడుకులిద్దరూ మనస్ఫూర్తిగా ఆనందించారు.

○



## సమీరా గురువు

బాలీవుడ్‌లో షారుఖ్ ఖాన్‌కి మంచి నటుడిగానే కాకుండా చక్కటి సలహాలు సూచనలిచ్చే గురువుగానూ పేరుంది. అలా భావించే తారల్లో సమీరారెడ్డి కూడా వుందిట. జీవితంలో పనికొచ్చే ఎన్నో సిద్ధాంతాలు తను షారుఖ్ నుంచి నేర్చుకున్నట్టు చెబుతుంది సమీరా. నిరాశానిస్పృహల్లో వున్నప్పుడు అతను చెప్పే మాటలు ఎదుటివారికి చాలా చక్కగా మేలుచేస్తాయంటుందామె. ఒక రకంగా అతను తనకి గురువుగానే కాదు, ఆధ్యాత్మికపరమైన వ్యక్తిలా కూడా కనిపిస్తాడంటుంది సమీరా. సంతోషం.